# హత్య

— పి. చంద్



జూలై మాసం.

వారం రోజులుగా ఒక్కటే ముసురు. ఎటూ కదలడానికి వీలులేకుండా ఉంది. వార్తల కోసం ఏం పని ఉన్నా లేకున్నా పొద్దున్నో, సాయంత్రమో అలా ఊరు ఊరంతా తిరిగి రావడం అలవాటయిపోయింది.

కానీ ముసురు మూలంగా ఎటూ కదలడానికి వీలుపడలేదు. ఆ రోజే కాస్త ముసురు తగ్గింది. రాత్రంతా సన్నగా కురిసిన వర్షం తెల్లారేసరికి పూర్తిగా వెలిసిపోయింది. లేత సూర్యుని కిరణాలు కడిగేసినట్టున్న చెట్ల కొసల మీదపడి ఆకుల పచ్చదనాన్ని మరింత కాంతివంతం చేస్తున్నాయి. బురద బురదగా ఉన్న నేల, కడిగేసినట్టున్న వీధులు.

ఆ సమయంలో పరంధామ పరుగు పరుగున వచ్చాడు...

పరంధామువి చురుకైన కళ్ళు. ఎప్పుడూ తొందరపడని స్వభావం. కానీ ఆ రోజు ఎందుకో కాస్త హడావుడి పడుతున్నట్టు కనిపించాడు.

వచ్చీ రావడంతోనే "అన్నా ఈ సంగతి విన్నావా ? నిందాపూర్‌లో ఓ అమ్మాయిని హత్య చేశారట!"

"హత్యా !"

"అవును... రాత్రి జరిగిందట... పొద్దున్నే తెలిసింది. వివరాలేం తెలియదు."

"సరే పది నిమిషాల్లో బయలుదేరుదాం. ఈ లోపు నీవోసారి స్టేషన్‌కు ఫోను చేసి వివరాలు కనుక్కో. నేను ఇంతలో తయారవుతాను" అంటూ బట్టలు మార్చుకోవడానికి ఇంట్లోకి వెళ్ళాను. పది నిమిషాల్లో తయారయి బయల్దేరాము.

మా ఊరినుంచి మండి నిందాపూర్ దాదాపుగా ఇరవై కిలో మీటర్ల దూరం. చుట్టూ వలయాకారపు ఎత్తైన కొండల మధ్య ఆ ఊరు ఉంటుంది. నిందాపూర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టక ముందు అదో ప్రత్యేకమైన ప్రపంచం. సిమెంటు ఫ్యాక్టరీ వచ్చిన తరువాత ఎత్తైన ఫ్యాక్టరీ గొట్టాలు, పెద్ద బిల్డింగ్‌లు, అధికారులు, ఉద్యోగులు ఉండే క్వార్టర్స్‌తో అక్కడి వాతావరణమే మారిపోయింది.

ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న ఎత్తైన గోడ, మెయిన్ రోడ్డు అనుకుని ఉన్న ప్రధాన గేటు. ప్రధాన గేటు ముందు నుండి మలుపు తిరిగే రోడ్డు సిమెంట్ లోడు కోసం వచ్చే లారీల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన విశాల మైదానం చివర్లో శవం పడి ఉంది.

అప్పటికే పోలీసులు పంచనామా కోసం వచ్చినట్టున్నారు. నిందాపూర్ సర్పంచ్ లచ్చిరెడ్డి, కంపెనీ పర్సనల్ మేనేజర్, పోలీసు అధికారి శవానికి దూరంగా వేసి ఉన్న కుర్చీల్లో కూచుని ఉన్నారు.

మమ్మల్ని చూసి సర్పంచ్ పలకరించాడు. లచ్చిరెడ్డికి యాభై సంవత్సరాలు పైబడి ఉంటాయి. బక్కగా, నల్లగా ఉంటాడు. ఏదో దిగులు ఆవరించినట్టుగా విచారం కమ్ముకున్నట్టుగా ఉంటాడు. మంచి మనిషి. ఆ మంచితనమే ఆయన్ని నలుగురిలో నిలబెట్టింది. ఎలక్షన్ల సమయంలో అంతకు ముందోసారి పరిచయం ఉంది. పర్సనల్ మేనేజర్ ప్రసాదరావు చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. ఎస్. ఐ. చూసి చూడనట్టుండిపోయాడు.

ఎస్. ఐ. ని వివరాల గురించి అడిగినప్పుడు అతను నిర్లిప్తంగా "ఏముంది ఎవరో చెరిచి చంపేసినట్టుంది. ఎంక్వయిరీ జరుగుతున్నది. పోస్ట్‌మార్టమ్ అయ్యాక కానీ పూర్తి వివరాలు చెప్పలేము" అంటూ ముక్తసరిగా అన్నాడు.

అమ్మాయి పేరు జంగుబాయి అని, వయసు పాతిక లోపేనని తండ్రి సోయం పోషం, తల్లి ఇస్రుబాయి అని, వాళ్ళది ఫ్యాక్టరీ అనుకుని ఉన్నగూడెం అని వివరాలు చెప్పాడు.

శవం చుట్టూ జనం గుమిగూడి ఉన్నారు. శవం పక్క కొద్దిమంది గిరిజనులున్నారు. ఛాతీమీద ఏ విధమైన అచ్ఛాదన లేని, ఎండిపోయిన ఛాతిని బాదుకుంటూ ఏడుస్తున్న ముసలి తల్లి, ఆమెను పట్టుకుని మరో ఇద్దరు గిరిజన స్త్రీలున్నారు. ముడతలు పడ్డ చప్పిడి ముఖం వృద్ధుడే సోయం పోషం. మాట పలుకు లేకుండా ఆ ముసలిదాని పక్కన కాళ్ళమీద కూచుని ఉన్నాడు. ఒక నడీడు మనిషి, మరో ఇద్దరు ముగ్గురు యువకులు వారి పక్కనే ఉన్నారు.

నిందాపూర్ సర్పంచ్ వెంటరాగా మేము ఆ గిరిజన స్త్రీ కుటుంబ సభ్యులను పలకరించాం...

"వాల్లింట మన్నుబొయ్య... నా బిడ్డను సంపేసిండ్లు..." అంటూ ముసలి తల్లి మమ్మల్ని చూసి మరోసారి బోరుమంది.

ముసలి తండ్రి వులుకు వులుకున మాకేసి చూస్తూ మాటా పలుకూ లేకుండా గాజుకళ్ళతో చూస్తుండిపోయాడు.

"ఎలా జరిగింది. మీ కెవరి మీదనైనా అనుమానం ఉందా" అని ఆ పక్కనే ఉన్న వాళ్ళకు సంబంధించిన యువకుల్ని ఉద్దేశించి అడిగాను.

అతను గాఢంగా నిట్టూర్చాడు. "ఏం చెప్పేది సార్... ఎట్లా జరిగిందో మాకు తెలువది. రెండు రోజుల నుండి ఇంటికి రాలేదు. గతంలో కూడా గిట్లనే వారం పది రోజుల దాకా ఇంటికి రాకుండా పోయేది. ఎటో తిరిగి తిరిగి దానికి బుద్ధి పుట్టినప్పుడు ఇంటికి వచ్చేది. ఎన్నిసార్లు చెప్పినా దానికి బుద్ధి రాలేదు. చెప్పి చెప్పి యాష్టకొచ్చి ఊరుకున్నం. కానీ గిట్లయితదని అనుకోలే" అతని

కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"చనిపోయిన అమ్మాయి అన్న అతను. ఇక్కడే కూలీ నాలీ చేసుకుంటూ బతుకుతున్నాడు. ఆ పక్కన ఉన్నతను కూడా ఆ అమ్మాయి అన్నే. వాళ్ళకు తోడబుట్టింది ఒక్కతే ఆడపిల్ల. ఉన్న ఒక్కదాని బతుకు ఇట్లా ముగిసింది" సర్పంచ్ లచ్చిరెడ్డి విచారంగా చెప్పుకొచ్చాడు.

అప్పటికే కంపెనీ వాళ్ళు ఏర్పాటు చేసిన లారీ వచ్చింది. చూడవచ్చిన జనాన్ని అటు ఇటూ తరుముతూ పోలీసులు శవాన్ని పోస్టుమార్టమ్ కోసం తీసుకుపోయేందుకు తొందరపడుతున్నారు.



ఒక్కసారి శవాన్ని చూసి ఫోటో తీయాలని, ఫోటో ఉంటే న్యూస్ కవరేజ్ బాగుంటుందని మా తాపత్రయం.

ఒక పాత బట్ట శవం మీద కప్పేసి ఉంది. తల, కాళ్ళు బయటే ఉన్నాయి. సగం తెరిచి ఉన్న కళ్ళు నిస్తేజంగా ఫ్యాక్టరీ కేసి చూస్తున్నట్లుగా ఉన్నాయి.

"ఫోటో తీయాలి ఆ బట్ట కాస్త తొలగిస్తారా ?"

హెడ్ కానిస్టేబుల్ మా మాటలకు ప్రతిస్పందిస్తూ "చాలా బీభత్సంగా ఉంది సార్ మీరు చూడలేరు..."

"అయినా ఫర్వాలేదు."

బట్ట తొలగించాడు. చిరిగిన జాకెట్టు, నడుము వరకు చెదిరిపోయిన చీర...చాలా బీభత్సంగా ఉంది. చూడలేకపోయాము.

"బట్టకప్పేయండి ఒక్క మొఖం కనిపిస్తే చాలు."

ఒక్కసారి ఆ అమ్మాయి మొఖాన్ని పరీక్షగా చూశాను. గుండ్రటి పెద్ద మొఖం. కాకుంటే గిరిజనులకు సహజంగా ఉండే చప్పిడి ముక్కు. మెడలో పూసల పేరు. చెవులకు బొగరి రింగులు. మాసిన తలలో ప్లాస్టిక్ పూలు. తెచ్చి పెట్టుకున్న పారిశ్రామిక సంస్కృతి. బురద బురదగా ఉన్న ఆ సిమెంట్ నేలలో కలిసిపోయింది.

ఫోటో తీసుకుని బయటికి వస్తూ ...

"ఏం చేస్తుండేది ఆ అమ్మాయి" అంటూ సర్పంచ్‌ను అడిగాను.

సర్పంచ్ మొఖంలో విషాదం కమ్ముకుంది. "ఏం చెప్పమంటారు" అని మౌనం దాల్చాడు.

సర్పంచ్ మాటలు నాలో ఆసక్తిని లేపాయి. లచ్చిరెడ్డి మొఖం వివర్ణమైంది. అంతవరదాకా అణిచిపెట్టుకున్న ఆవేదన బద్దలైనట్లుగా గొంతు గంభీరమైంది.

"చుట్టూ గీ కొండలు చూడుండ్రి. అంతా సిమెంట్ దుమ్ము. ఒక చెట్టు బతకదు. మేము బతకం."

ఏదో చెప్పాలనే ఆవేశం అతనిని ఇంకేమీ మాట్లాడనివ్వలేదు.

"ఇంతకూ మీరనేది ?"

"ఏం లేదు. ఆ పోరి చెడిపోయింది. ఎవనితోని పడితే వానితోని తిరిగేది. అట్లా తిరిగి తిరిగి గిట్లయి పోయింది బ్రతుకు" ఆయన గొంతు పూడుకుపోయింది దుఃఖంతో.

"మీరు బాధలో ఉన్నారు. మరోసారి కలుస్తాను" అని లచ్చిరెడ్డి నుండి సెలవు తీసుకోబోతుంటే.

"ఇదిగో అన్న ! మా బాధ మా కడుపులనే మసలుతాంది. మా గురించి ఎవరు పట్టించుకున్నదీ లేదు. కంపినోడు మమ్మల్ని నీళ్ళు లేని కాడ బొండిగ కోసిండు. నీతోని చెప్పుకుంటే కనీసం లోకం కన్నా తెలుస్తది. నీతోని వివరంగా మాట్లాడాలని ఉంది" అన్నాడు ప్రాధేయపడుతున్నట్లుగా.

"తప్పకుండా మాట్లాడుదాం."

"ఎప్పుడంటే అప్పుడే."

"పంచనామా ఎప్పుడైతదో తెలువదు. ఆ తరువాత కావల్సిన కర్మకాండ. రెండు రోజుల తరువాత వీలు అవుతుందా ?"

"తప్పకుండా వస్తాం."

శవాన్ని లారీలో ఎక్కించి గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకుపోయారు. పెద్ద హడావుడి ఏం లేకుండానే మామూలుగా హత్యా నేరాన్ని నమోదు చేసుకుని వాళ్ళ పని ముగించుకున్నారు పోలీసులు. చుట్టుప్రక్కల గూడేల నుండి వచ్చిన గిరిజనులు మెల్ల మెల్లగా ఎవరిదారంట వాళ్ళు వెళ్ళిపోయారు. కావల్సిన వాళ్ళను వెంట పెట్టుకుని సర్పంచ్ లచ్చిరెడ్డి గవర్నమెంట్ దవాఖానాకు వెళ్ళాడు.

ఆ రోజు సాయంత్రం మామూలుగా నిందాపూర్‌లో జరిగిన హత్య గురించి పోలీసులు ఇచ్చిన రిపోర్ట్ 'అమ్మాయి పేరు, వయసు, తల్లితండ్రుల పేర్లు' హత్య మీద పోలీసులు తెలిపిన అనుమానం అంతా రిపోర్ట్ రాసి పంపాము. కానీ ఏదో అసంతృప్తిగా ఉంది. ఎందుకో సర్పంచ్ మాటలు నన్ను కలిచివేశాయి.

నేను పుట్టి పెరిగింది కాలనీ ప్రాంతం లోనే. మా నాన్న బొగ్గు బావుల్లో క్లర్కుగా పని చేసేవాడు. నా చిన్నప్పుడు నిందాపూర్ ప్రాంతం నుంచి గిరిజనులు కట్టెల మోపులు తెచ్చి కాలనీ ప్రాంతంలో అమ్ముకుని పోవడం బాగా గుర్తుంది. ఇప్పుడు చుట్టుప్రక్కల అడవులు లేకుండా పోయాయి. సిమెంట్ ఫ్యాక్టరీ వచ్చాక అక్కడి వాతావరణమే మారిపోయింది. అడవి అంతరించింది. సిమెంట్ ఫ్యాక్టరీ రేపే దుమ్ముతో అక్కడి చెట్లు, అడివి మసకబారిపోయాయి. అక్కడి సంస్కృతిలో మార్పు వచ్చింది. ఫ్యాక్టరీతోపాటు పని చేసే కార్మికులు, టెక్నీషియన్లు వచ్చారు. కార్మికులతో పాటు యూనియన్లు వచ్చాయి. రోడ్డు, రైల్వే లైను వచ్చింది. ప్రతి రోజూ ఆ రోడ్డు మీద తిరగాడే వందలాది లారీలు వచ్చాయి. ఫ్యాక్టరీతో పాటు శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీస్ స్టేషన్ వచ్చింది. అన్ని హంగులు ఏర్పడడంతో ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి వారు ప్రత్యేకంగా ఫ్యాక్టరీకి రైల్వే లైను వేశారు.

మూడవనాడు లచ్చిరెడ్డిని కలవడానికి బయలుదేరాము. ఫ్యాక్టరీ రోడ్డును అనుకుని వూళ్ళోకి పోయే మట్టి రోడ్డు ఉంది. ఫ్యాక్టరీ గేటును ఆనుకుని పోయే ఆ మట్టి రోడ్డులో మరికాస్త ముందుకుపోతే నిందాపూర్ ఊరు వస్తుంది. నిందాపూర్‌లో ఒకప్పటి గిరిజన గూడెం తాలూకూ ఛాయలు ఇంకా ఈ ఊళ్ళో కనిపిస్తూనే ఉన్నాయి. పాతిక ముప్పయికి మించి లేని పూరి గుడిసెలు వాటి మధ్య ఒక్కటి రెండు పెంకుటిండ్లు. సర్పంచ్ ఇల్లు కాస్త పెద్దగా ఉంది. పాత తరం ఇల్లు లావాటి టేకు దూలాలతో కట్టి ఉంది. ఎప్పుడో లచ్చిరెడ్డి తాతల నాడు గోదావరి ఆవల నుండి ఈ ఊరికి వచ్చారు. అట్లా బతకవచ్చిన వెలమలు, రెడ్లు అటు తరువాత పెద్ద పెద్ద భూస్వాములు అయిపోయి వేలాది ఎకరాలు ఆక్రమించారు. కానీ లచ్చిరెడ్డి కుటుంబం మాత్రం ఇంకా మధ్య తరగతి రైతు కుటుంబపు పరిస్థితి నుండి మారలేదు. ఉన్న పాతిక ఎకరాల్లో పది ఎకరాలు ఫ్యాక్టరీ కింద పోయింది. మరో ఎనిమిది ఎకరాలు బొడగరాళ్ళతో నిండిపోయి పశువులు మేపుకునే కంచెగా పనిచేస్తున్నది. మరో ఏడు ఎకరాల్లో కాలాన్ని బట్టి మక్కలో, పెసరో వేసినా పంట కూడా అంతంత మాత్రమే. అంతకు ముందు ఎలక్షన్లు జరిగినా అంత గుర్తింపు ఉండేది కాదు. ఫ్యాక్టరీ వచ్చిన తరువాత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒక ప్రత్యేకత ఏర్పడింది. లచ్చిరెడ్డిది అందరితో కలిసిపోయే తత్త్వం. అదే అతన్ని సర్పంచ్‌ను చేసింది. కానీ సర్పంచ్‌గా తాను ఏం చేయలేనని అర్థం కావడానికి అతనికి ఎక్కువ రోజులు పట్టలేదు.

పెంకుటింటి ఎదురుగా వేసి ఉన్న కొట్టం గుండా ముందు రూమ్‌లోకి పోయి కూచున్నాం. అతను ఇంట్లో ఏదో పనిలో ఉన్నట్లుంది. నేను వచ్చింది తెలుసుకుని చేస్తున్న పని వదిలి వచ్చాడు.

"మీరు అనుకున్నట్టుగా వచ్చిండ్లు" పరిచయపూర్వకంగా మాట కలిపాడు. "అనుకున్న తరువాత రాకుండా ఎట్లా ఉంటాము"

అన్నాను.

అంతలోనే ఇంటి ముందున్న ఓ యువ కుణ్ణి కేకేసి "లచ్చులు, నారాయణ, పోమను పిలుచుకురా" అని పంపాడు.

"చాయ్ ఫలహారం ఏమన్నా" అడిగాడు లచ్చులు.

"అబ్బే ! ఎందుకు ఇప్పుడే చాయ్ తాగి వచ్చాము" అన్నాను మొహమాటంగా.

"అట్లా అంటే ఎట్లా సారు. రాక రాక మా ఇంటికి వచ్చిండ్లు. మా తృప్తి కోసమైనా ఏదన్నా తీసుకోవా" అన్నాడు లచ్చులు ....

"అమ్మమ చాయ్ పెట్టమను" అంటూ పది పన్నెండు ఏండ్ల వయస్సున్న వాళ్ళ అమ్మాయిని పురమాయించాడు.

"కేసు ఏమైంది." అసలు విషయంలోకి లాగాను.

"కేసు ఏమైతది సారు. దాని గురించి పట్టించుకున్నది ఎవరు ? ఎంక్వయిరీ కొన సాగుతుందని ఎస్. ఐ. చెప్పిండు. ఆ రోజు వచ్చిన లారీలోళ్లను, ఇంకా అక్కడి చిన్న చిన్న హోటల్ వాళ్ళను ఎంక్వయిరీ చేసిండ్లు. అయినా ఇప్పుడు చేసేది ఏముంది ? పోయిన ప్రాణం పోనే పోయింది. ఉన్న ప్రాణాలన్నా పోకుండా చూసుకోవాలి" లచ్చిరెడ్డి మాటల్లో విచారం ధ్వనించింది.

ఆయన మాటలేవీ నాకు సరిగా అర్థం కావడం లేదు. అలవాటుగా కలం, కాగితం చేతుల్లోకి తీసుకున్నాను.

లచ్చిరెడ్డి ఒకసారి నాకేసి, నా చేతుల్లోని కలం. కాగితంకేసి చూస్తూ చెప్పసాగాడు.


"జంగుబాయి హత్య జరిగింది కాబట్టి కేస యింది. కానీ కేసు కూడా కాకుండా ఎంత మంది అమ్మాయిలు కనిపించకుండా పోయిండ్లో లెక్కేలేదు" అతని ముఖంలో అదే విచారం.

లచ్చులు చెప్పడం ప్రారంభించాడు. "ఈ ఫ్యాక్టరీ రాక ముందు మేము ఇక్కడ ఈ అడి విల జంతువుల్లో జంతువులోలే మా బతుకు మేం బతికినం. మాకున్న భూముల్ల విత్తే చెల్కో వాటి, దేవుడు కరుణించి ఇంత ఫలమో పత్రో పండితే అదే తిని బతికినం. పంటలు పండని వారు అడవిల జంతువుల తీర్గ ఆకులు అలములు తిని బతికినం. ఎప్పుడైతే ఈ ఫ్యాక్టరీ ఇక్కడ పడ్డదో అప్పుడు మా కష్టాలు మొదలయినాయి. ఫ్యాక్టరీ వస్తే భూములు పోయిన వాళ్ళకు ఉద్యోగాలు ఇస్తమన్నారు. పది పన్నెండు సంవత్సరాల యింది. ఇంతవరకు ఒక్కరికి ఉద్యోగం ఇచ్చిందిలేదు. మా పొలాలల్ల సిమెంటు దుమ్ము పేరుకుపోయింది. ఎంతకష్టపడ్డా మొలక మొలవదు. మొలచిన మొలకైనా గింజరాల్చదు. ఇక దాంతో మా వోళ్ళంతా అమ్మామో రామచంద్రా అంటూ తలోదారి పట్టిండ్లు. కొన్ని కుటుంబాలు పొట్ట చేత పట్టు కుని ఇక్కడి నుండి వెళ్ళిపోయిండ్లు. మరి కొంత మంది అక్కడక్కడ కూలీనాలీ చేసు కుంటూ బతుకులు వెల్లదీస్తాండ్లు."

అంతలో —ఇందాక వూళ్ళోకి పంపించిన యువకుడు కొంత మంది గ్రామస్తులను వెంట పెట్టుకుని వచ్చిండు.

లచ్చిరెడ్డి వచ్చిన వాళ్ళకేసి చూసి 'నారాయణ లేడా' అని అడిగాడు.

"పొద్దున్నే పనికి పోయిండట సాయం త్రానికి కానీ తిరిగి రాడట" అన్నాడా యువకుడు.



వచ్చిన వాళ్ళలో కొంత మంది ఇంటి ముందు అరుగు కొసన కూచున్నారు. మరికొంత మంది వాకిట్లో నిలబడి ఉన్నారు. ఇంకొంత మంది మేమున్న గదిలోకి వచ్చారు.

లచ్చిరెడ్డి వాళ్ళను ఉద్దేశించి "ఈసారు పేపర్ల రాస్తడు. మన బాధలు ఈసారుతోని చెప్పు కుంటే పేపర్ల వస్తది. అట్లనన్నా మన కష్టాలు లోకానికి తెలుస్తది. అప్పుడన్నా కంపెనోడు మన గురించి ఏమన్నా పట్టించుకుంట దేమో" అంటూ నన్ను పరిచయం చేశాడు.

వాళ్ళంతా బెరకు బెరకున నాకేసి చూస్తుండిపోయారు. నిజానికి పేపర్లో వచ్చి నంత మాత్రాన వాళ్ళ కష్టాలు గట్టెక్కుతా యని నాకేమాత్రం నమ్మకం లేదు. ఫ్యాక్టరీ వచ్చి దాదాపు పది పన్నెండు సంవత్సరా లైనా వాళ్ళకు తెలియకపోవచ్చు.

ఇంట్లో నుండి చాయ్ వచ్చింది. లచ్చిరెడ్డి నాకో కప్పు ఇచ్చి తనొకటి తీసుకున్నాడు.

"నాకైతే నమ్మకం లేదు. మీ సమస్యల పరి ష్కారానికి మా రాతలు ఏ మేరకైనా ఉప యోగపడితే అదే సంతోషం" అన్నాను.

పొట్టిగా...అతుక్కుపోయిన దౌడలు, వెడల్పు ముక్కు, సగం నెరిసిన తల, నెత్తికి చుట్టిన పాత పేగు, మొలకో పంచె, చేతులు జోడించి నా ముందు నిలబడ్డారు. ఓ నడీడు మనిషి.

"నా కంటే పెద్దాయనవు నాకు దండాలు పెట్టవద్దు. అట్లా కూచొని నీవు చెప్పాలనుకు న్నది చెప్పు."

నేల మీద కూచున్నాడు.

"నీ పేరు."

"జంగు తొడషం జంగు."

"ఫ్యాక్టరీ రావడం వల్ల నీకు వచ్చిన నష్ట మేదో చెప్పు పెద్దయ్య".

ఎలా మొదలు పెట్టాలో తెలియక క్షణకా లం బిత్తర చూపులు చూశాడు.

లచ్చిరెడ్డి కల్పించుకుని "ఇప్పుడీ ఫ్యాక్టరీ అడుగున్నే జంగు భూములుండేవి. ఫ్యాక్టరీ కింద భూములు గుంజుకున్నరు. కాదు కూడ దన్నా మా మాట ఎవరూ వినిపించుకోలేదు. ఎమ్మార్వో వచ్చిండు. సర్వేయర్లు వచ్చిండ్లు. కంపెనీ అధికార్లు వచ్చిండ్లు. ఎక రానికింత అన్నరు. జంగు పదిహేను ఎకరా లకు పదిహేను వేలిచ్చిండ్రు. దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్టు చేసిండ్లు. అదే కాసిపేట దొర భూములు క్వారీకింద పోయినయని ఎందుకు పనికిరాని భూములకు ఎకరానికి పాతిక వేలు ఇచ్చిండ్లు. అడిగే నాథుడు లేడు. న్యాయంగా ధర కట్టింది లేదు. అంత అన్యాయమే జరి గింది" లచ్చిరెడ్డి చెప్పుకొచ్చాడు.

జంగు నిజమే అన్నట్టుగా తలాడిం చిండు.

"సరే మరి భూములు పోయిన తరువాత నీవేం చేస్తున్నావు ?"

నా ప్రశ్నకు సూటిగా నా మొఖంలోకి చూస్తూ తొడషం జంగు "ఏమున్నదయ్యా ఏదో కూలీ నాలీ చేసుకుంటూ బతుకుతు న్నం. కొడుకులు నాతోపాటే కూలీచేస్తరు. నా బిడ్డ పన్జేస్తది. అయినా తిండికి ఎటమట మైతాంది."

"జంగన్న మీ చిన్నోని సంగతి చెప్పు" ఎనక నిలుచున్న అతను ఎవరో అన్నారు.


చిన్న కొడుకు ప్రస్తావన వచ్చేసరికి జంగు మొఖంలో విషాదం అలుముకొంది.

"సారూ... మా చిన్న కొడుకు పోయినేడు చనిపోయిండు. మా భూములు పోయినాక ఉద్యోగాలు ఇస్తామని చెపితే, మా చిన్న పొల్లగాన్ని ఫ్యాక్టరీకి పంపిస్తే కంట్రాక్టరు దగ్గర లోడింగ్ అన్ లోడింగ్ కాడ పెట్టిండు. అక్కడ బోలెడు పని. ఆ పనికి బల్ల చెక్కతీ రుగ ఉన్న మనిషి నల్ల పూస తీరుగ అయిండు. రోజుకు పది గంటలు సిమెంటు దుమ్ముల పన్జేసేసరికి వాని ఊపిరితిత్తులు చెడిపోయినై. ఎన్ని మందులు తిన్నా రోగం తగ్గలేదు. వాడు ఎంతో ఆపచ్చన పడి పని చేసి సంపాదించుకున్న పైసలు వాని రోగా నికే సరిపోలేదు. సిమెంటు వాని ఊపిరితి త్తుల గడ్డలు గడ్డలుగా పేరుకపోయిందన్నరు. ఆపరేషన్ చేస్తే బతుకుతడన్నరు. కంట్రాక్టరు దగ్గర పన్జేసే వాళ్ళకు పర్మినెంట్ వాళ్ళ రూల్స్ ఉండవని కంపెనీ చేతులు దులుపు కున్నది. చేతిలో చిల్లిగవ్వలేక ఆరు నెలలు నా కొడుకు మంచంల పడి సచ్చిపోయిండు. వానికి ఇద్దరు పోరగాండ్లు, భార్య ఉన్నది." జంగు కళ్ళలో నీళ్ళూరినయి.

(ముగింపు వచ్చేవారం)

# హత్య

- సి.చంద



(గతసంచిక తరువాయి)

అటు తరువాత హన్మంతు మాట్లాడాడు. ఆయన పరిస్థితి కూడా జంగు పరిస్థితి కంటే భిన్నంగా లేదు. కానీ ఇంతలోకే యాభై సంవత్సరాలు పైబడిన ఒక స్త్రీ వచ్చింది. ఆమె ముక్కుకు రింగులాంటి పెద్ద ఆభరణం. చెవులకు సాగిపోయి వేలాడే గెంటీలు. మెడలో పాతకాలం నాటి వెండి కంటె, పూసల పేర్లు, కట్టుకున్న చీర కొంగుతో రొమ్ములను కప్పుకుని చీర కొంగు నడుములో చెక్కుకున్నది. ఇక్కడేదో రాతపూతలు జరుగుతున్నయని తెలిసి ఆగం ఆగంగా ఉరికి వచ్చింది. కానీ పేపర్లరాసే వాళ్ళు వచ్చిండ్లని తెలిసి "రాస్తే మనకే మస్తదట మన భూములు మన కస్తయా ఏమన్న పైసలు వస్తయా" అంటూ అమాయకంగా అడిగింది.

"అవేమీ రావు" ఎవరో వెనుక నుంచి అన్నారు.

"అట్లనా" అంటూ అక్కడ తనకేమీపనిలేనట్లుగా తిరిగి పోబోతుంటే లచ్చిరెడ్డి కల్పించుకుని "లచ్చక్క కాసేపు నిల్చోరాదే. మన కష్టం చెప్పుకుంటే వినే మనిషి దొరికిండు".

లచ్చమ్మ పెద్ద బోసి నోరు తెరిచి...

"ఇదిగో అయ్యా నేను చెప్పేదేం లేదు. మాది ఎనిమిది ఎకరాల చెల్క పోయింది. మిగిలిన భూముల దుమ్ము తప్ప మరేమీ పండదు. మా ముసలాయన మంచంలపడ్డడు. చేసేటోళ్ళు ఎవరూ లేరు. కంపినోడు మాకింకా పైసలియ్యాలె. పైసలు రావాలని రాయిండ్రి.

"పైసలు ఎక్కడివి. పైసలు ఏమి ఇచ్చేది లేదంటా" ఓ యువకుడు ఆమె మాటలకు అడ్డు తగిలాడు.

"అదేందయ్యో పల్కల వాగు వొడ్డున బంగారం పండేది. ఎకరానికి వెయ్యి ఇచ్చి చేతులు దులుపుకుంటే అయితదా. ఎకరానికి పది వేలు పెట్టినా అటువంటి చెల్క రాదు. వాడిచ్చిన వెయ్యి ఏ లెక్క ప్రకారం. వీల్లందరూ పైసలు రావంటరు. పైసలు ఎందుకు రావు. రాకుంటే మాకు మా అసుంటి భూమి చూయించుమండ్లి. నీళ్ళు లేని కాడ బొండిగ కోసినట్లు చేసిండ్లు కదయ్యా ఇదేం న్యాయం. భూమి మీద ఇంత అన్యాయం పనికిరాదు బిడ్డా అన్యాయం చేసినోళ్ళను బాయమ్మ తల్లి (గిరిజన దేవత) ఊరికే వదలదు."

లచ్చక్క మెరుపులా వచ్చింది. ఉరుములా ఉరిమింది. బడబడ అని తనకు పని ఉందని వెళ్ళిపోయింది.

లచ్చిరెడ్డి అటు తరువాత లచ్చమ్మ గురించి చెప్పుకొచ్చిండు.

"ఒకప్పుడు మంచిగానే బతికింది. మొగోని కంటే ఎక్కువ కష్టపడది. యవసాయంలో లచ్చక్క చేయలేని పని లేదు. ఏమైతేనేమి అందరిలాగే ఆమె భూములు పోయినయి. ముసలాయన చాతకాకుండా అయిండు. ఒక్క బిడ్డ ఉండేది. బతుకు దెరువుకోసం గా కొండల్లో దొరికే పరికిపండ్లో రేగిపండ్లో ఏరుకుని వచ్చి ఫ్యాక్టరీ గేటుకాడ అమ్ముకుంటది.

దానితోపాటే లచ్చక్క ఎదిగిన బిడ్డ కూడా అదే పనిచేసేది. అమాయకురాలు. పొల్లె అన్నెం పున్నెం ఎరుగనిది. ఫ్యాక్టరీకాడి కంట్రాక్టరు గాళ్ళు దానికి మాయమాటలు చెప్పి పావులా పర్క ఇచ్చి మచ్చిక చేసుకున్నరు. చివరికి ఎవనితోనో లేచిపోయింది. ఆర్నెల్లయితాంది మళ్ళీ తిరిగి రాలేదు...."

అటు తరువాత మరికొంతమంది మాట్లాడారు. కాస్త హెచ్చుతగ్గులున్నా అందరి బాధా ఒక్కమాదిరిగానే ఉంది. కాకుంటే పేర్లు మార్పు అంతే తేడా. గూడేల వారిగా ఎన్ని కుటుంబాల వారు ఎంతెంత భూమి కోల్పోయిందీ వివరాలు అడిగి నోటు చేసుకున్నాను. కానీ ఈ రిపోర్టు ఒక్కటే సమగ్రం కాదనిపించింది. ఒక్కసారి అన్ని గూడేలు తిరిగి ప్రత్యక్షంగా చూడాలనే కోరిక కలిగి అదే విషయం వారితో చెప్పాను.

లచ్చిరెడ్డి నా మాటకు సంతోషం వ్యక్తం చేస్తూ "మేమే మా గూడాలను చూయించాలనుకున్నాము. కానీ మీకు నాతో పాటు తిరిగే ఓపిక ఉంటుందో లేదోనని ఎకనముందాడినం" అంటూ దారితీశాడు.

నిందాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ చుట్టూ కోట పెట్టినట్టున్న ఎత్తైన కొండలు. సహజసిద్ధమైన కోటలా ఉంటాయి కొండలు. ఒక్కవైపు నుంచే దారి ఉంటుంది. ఆ దారికి మించి ఫ్యాక్టరీకి పోయే మార్గం మరొకటి లేదు. ఎటు అయిదారు మైళ్ళ వరకూ విస్తరించి ఉన్న వలయాకారపు కొండల మధ్య దాదాపు పాతిక ముప్పయ్ దాకా గూడాలున్నాయి. గిరిజన గూడెం అంటే పెద్ద ఊరేమీ కాదు. ఒక్క నిందాపూర్ గ్రామమే కాస్త పెద్దది. మిగతా గూడాల్లో ఎక్కడా కూడా పది పదిహేను గుడిసెల కంటే మించి లేవు. కొన్ని గూడేలు అయితే మరీ విసిరేసినట్లుగా అడవి మధ్య ~ అయిదారు గుడిసెలు కంటే మించి లేవు. వాళ్ళ బతుకుల్లాగే వాళ్ళ గుడిసెలు కూడా సరైన కప్పులు లేక పేదరికం తాండవిస్తూ కనిపించాయి. దిసమొల పిల్లలు సరిగా ఆచ్ఛాదన లేని స్త్రీలు. బక్కచిక్కిపోయి చావు కోసం ఎదురు చూసే వృద్ధులు. ఇంకా ఆదిమ కాలం నాటి జీవన విధానాన్ని తలపిస్తున్నాయి. ఒక గూడేనికి మరో గూడానికి పోవడానికి బండ్ల బాట కూడా సరిగా లేదు. కాలిబాట తప్ప మరోమార్గం లేదు.

ఇంద్రవెల్లి సంఘటన తరువాత ఐ.టి.డి.ఏ. వాళ్ళు తవ్వించిన బావులు అవినీతి మూలకంగా నీళ్ళులేని బొందలుగా మిగిలిపోయినవి. కొన్నిచోట్లనయితే అంతకు ముందే గిరిజనులు తవ్వుకున్న బావులు కూడా ఐ.టి.డి.ఏ. వాళ్ళు తవ్వీన బావుల కిందనే చూయించి దళారులు గుట్టు చప్పుడు కాకుండా నిధులు స్వాహా చేశారు. అన్నీ తెలిసిన కాడ పట్టణాల్లోనే అవినీతి నిలయాలైన ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు ఇక మారుమూల గిరిజనులను దగా చేయడంలో పెద్దగా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు.

అన్నింటికంటే విచిత్రమైంది మరొకటిఉంది. అదే ఫ్యాక్టరీ నిర్మాణం, ఫ్యాక్టరీ ముందువైపు క్వార్టర్స్ ఉన్న ఏరియా గాలివాలు వ్యతిరేక దిశలో ఉండి ఫ్యాక్టరీ నుండి లేచే దుమ్ము, ధూళి, పొగ అంతగా రాదు. ఫ్యాక్టరీ వెనుక వైపున ఉన్న గిరిజన గూడేంల మీదికి నిరంతరం ఎగజిమ్మె సిమెంట్ దుమ్ము అక్కడి వాతావరణాన్నే మార్చివేసింది. దూరంగా చుట్టూ కొండలు ఉండడం వలన ఫ్యాక్టరీ వదిలే విష పదార్థాలతో నిండిపోయింది. అక్కడొక్కటి ఇక్కడొక్కటిగా మిగిలిపోయిన చెట్లు కూడా జీవచ్ఛవాల్లా మోడువారిపోయాయి. వర్షాకాలం ప్రారంభమైనా వాటిలో పచ్చదనమే లేదు. ఎక్కడ చూసినా అర అంగుళం వరకు సిమెంట్ దుమ్ము పేరుకుపోయింది.

అయినా ఇప్పటికీ ఆ గూడాల్లోని గిరిజనులు మిగిలిన ఆ భూముల్లోనే వ్యవసాయం చేసుకుంటున్నారు. ఒక్కచోట మొక్కజొన్న చేనులు చూస్తే వ్యవసాయం ఎంత దుర్భరంగా ఉందో అర్థం అవుతుంది. ఒక్క కర్ర కూడా బలంగా లేదు. ఇక వాటి నుండి వచ్చే దిగుబడి ఎటువంటిదో ఊహించుకోవచ్చు.

మేము పోయే దారిలో ఒక వాగు అడ్డం వచ్చింది. వాగు దాటుతుంటే లచ్చిరెడ్డి ఒక్క క్షణం ఆగి వాగు గురించి చెప్పాడు. 'ఒకప్పుడు గీ వాగు ఒడ్డున నిలబడి చూస్తే కింద ఉన్న బండరాళ్ళు స్పష్టంగా కనిపించేవి. ఈ బండరాళ్ళే సిమెంట్ ఫ్యాక్టరీకి ఉపయోగపడే రాయి అని తెలియని రోజుల్లో పల్కలు పల్కలుగా ఉన్న బండరాళ్ళ గుండా ప్రవహించే

వాగు కాబట్టే పల్కాల వాగు అని పేరు వచ్చింది. ఇప్పుడు పల్కాల వాగుల నీళ్ళు అడుగు బండలు కాదు కదా కనీసం పశువులు తాగడానికి కూడా పనికిరాని నీరయిపోయింది. ఫ్యాక్టరీ నుండి వెలువడే చెత్తా చెదారం రసాయనాలు కలిపిన నీరు ఈ వాగులోకి వదిలివేయడం వల్ల ఇట్లా అయిపోయింది.' అన్నాడు.

మోకాలు మంటి మురికి నీళ్ళగుండా వాగు దాటుతుంటే చిరెత్తించే ఏదో మురుగు వాసన ఊపిరి సలుపనివ్వడంలేదు. ఒడ్డున చేరాం. ఆ వాగు ఒడ్డున ఒక్క పెద్ద ఊడలు దిగిన మర్రిచెట్టుంది. మర్రిచెట్టు అడుగున మట్టితో కట్టిన గద్దె. దాని మీద ఒక కర్ర పాతి ఉంది.

ఇదే బాయమ్మ దేవత. పంటలు కోతలు మొదటి పసలు చేతికొచ్చినంక ఇక్కడ జాతర జరిగేది. నా చిన్నప్పుడైతే ఆ జాతర ఎంత సంబరంగా ఉండేదో పున్నమిరోజు జరుగుతుంది ఆ జాతర. పిండిలాంటి వెన్నెల్లో అన్ని గూడాల వాళ్ళు అక్కడ చేరుకునేవాళ్ళు. నా చిన్నప్పటి రోజులు నాకింకా గుర్తున్నాయి. అప్పుడు పండుగంటే ఎంత సంబరం ఉండేదో తుడుం మోతలు, డుప్పికొమ్ముల బాకాలు, రాత్రంతా బాయమ్మ తల్లి కథ చెప్పేవాళ్ళు. తెల్లారేవరకూ జాతర సాగేది. ఇప్పుడా జాతరలు లేవు. ఆ సంబరం లేదు.


లచ్చిరెడ్డి మొఖంలో ఏదో విచారం. ఏదో కోల్పోయినట్లు అతని కళ్ళు అరమోడ్పులైనాయి.

బాయమ్మ దేవతను నా కెమెరాలో బంధించాను. లచ్చిరెడ్డి తన చిన్ననాటి సంగతులు చెప్పుతుంటే ఊకొడ్తు ఇంకా ముందుకు పోయాను. మేము పడమటి కొండవాలు దాక నడిచిపోయాము. అక్కడో గూడెంలో ఆగి వారితో కాసేపు మాట్లాడాం.

అక్కడి జనం ఇంకా వెనుకబడి ఉన్నారు. చాలా మంది మాట్లాడే భాష తెలియకుండా ఉంది. కొద్ది మంది తెలుగు మాట్లాడగలిగినా అంత స్పష్టత లేదు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలేవీ ఇంకా వాళ్ళ ఛాయల్లోకి వచ్చిన జాడలేమీ లేవు. నిజానికి నాకు కొత్త అనుభూతి కలిగింది. అంతకు ముందు నేను ఎన్నడూ చూడని కొత్త లోకానికి పయనమైనట్లు అనిపిస్తోంది. పత్రికల్లో పని చేస్తున్న వాణ్ణి సోమాలియా కరవు బాధితుల ఫోటోలు, వాళ్ళ గురించిన వార్తలు కథలు కథలుగా చదివిన వాణ్ణి. కానీ మన దేశంలో, మన రాష్ట్రంలో, మన జిల్లాలో, మన ప్రాంతంలో మనకు పాతిక ముప్ఫయి కిలో మీటర్ల దూరంలో మరో సోమాలియాను కనీసం ఊహించనైనా ఊహించలేకపోయాను.

అప్పటికే ఎండ నడినెత్తి మీదికి వచ్చింది. గూడేల జనం పలచగా ఉన్నారు. ముసలి, ముతక పిల్లలు తప్ప అందరూ చెల్కాల వద్ద కొండమీద దొరికే ఆకులు అలములు ఏరుకోవడానికి వెళ్ళిపోయారు. మేము ఒకచోట ఆగినప్పుడు మా చుట్టూ గుమిగూడిన దిసమొల పిల్లలు. ముసలి ఎంకులు, అతని తల మీద చుట్టుకున్న మాసిపోయిన పెద్ద తలపాగా. లచ్చిరెడ్డి ఆయనతో మాట కలిపాండు.

ముసలాయన దృష్టి మందగించినట్టుంది. జీవంలేని కళ్ళతోని అదే పనిగా లచ్చిరెడ్డి కేసి చూస్తూ "వెంకటరెడ్డి కొడుకుగదా కండ్లు కనిపిస్తలేవు కాళ్ళు చేతులు అడకుంటయినయి. దేవునికింకా నా మీద దయకలుగుతలేదు" అన్నాడు.



"అదేం పెద్దయ్యా అట్లంటవు... నీవు అందరికీ పెద్దదిక్కటువంటోడివి... ఇంకా చాన్నాళ్ల పాటు బతకాలి" లచ్చిరెడ్డి అనునయంగా అన్నాడు.

"ఎందుకు బిడ్డా బతికి... కాళ్ళు చేతులు సక్కంగ ఉన్నోడే బతకలేని రోజులు వచ్చినయి. అన్ని వచ్చినోన్ని నేను బతికేం సాధించాలె..." అని ముసలాయన నిర్లిప్తంగా చెప్పాడు.

కాసేపు అక్కడ గడిపి ముందుకు కదిలాం ఆ దారిలో గిరిజన పిల్లల కోసం గవర్నమెంట్ వాళ్ళు కట్టించిన బడి ఒక్కటే కనిపించింది. మొత్తం గూడాలకు అదొక్కటే బడి. సింగిల్ టీచర్ ఆ రోజు యింకా వచ్చినట్టు లేదు. పిల్లలు గోల గోలగా అరుస్తూ ఆడుకుంటున్నారు.

"గవర్నమెంట్ వాళ్ళు బడిపెట్టిండ్రు. ఒక్కడే పంతులు. ఆయన దగ్గరలో ఉన్న పట్నం నుంచి వచ్చి పోతడు. వచ్చినప్పుడు వస్తడు. రాని నాడు రాడు. నెలకు నాలుగు రోజులు బడినడిస్తే అదే గొప్ప. అదేందని ఒకసారి రిపోర్ట్ చేస్తే అంతకు ముందున్న పంతులు ఇక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ చేయించుకునిపోయిండు. ఇప్పుడొచ్చిన పంతులు ఇక ఆయన ఇష్టారాజ్యం. అడిగి అడిగి నోరు పోయింది. ఇంకేమీ లాభంలేదని నోరుమూసుకున్నా" అన్నాడు లచ్చిరెడ్డి.

మొత్తం గూడాలన్నీ తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం రెండు దాటింది. "అన్నం తిని పోండి" అని లచ్చిరెడ్డి బలవంతం చేశాడు. అప్పటికే ఆలస్యం అయిపోయింది. మరోసారి ఎప్పుడైనా వచ్చినప్పుడు చూద్దాంలే అని అక్కడ సెలవు తీసుకుని బయలుదేరాను.

అదే రోజు సాయంత్రం రిపోర్టు రాయడానికి కాగితాలు ముందు వేసుకుని కూచున్నాను. ఎలా మొదలు పెట్టాలో అర్థం కావడంలేదు.

గత సంవత్సరమే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్ళు పొల్యూషన్ కంట్రోల్ చేయడంలో ఉత్తమ ఫ్యాక్టరీగా బహుమతి ఇచ్చినప్పుడు పెద్ద ఎత్తున మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసిన సభ సందర్భంగా జర్నలిస్టులకు గిఫ్టుగా ఇచ్చిన మెమొంటో నా ఎదురుగా ఉన్న కప్‌బోర్డ్‌లో నన్ను వెక్కిరిస్తూ నాకేసి చూస్తూ కనిపించింది.

ఒక్కటా రెండా ఎన్ని కుటుంబాలు ఎలా ఛిన్నాభిన్నం అయిపోయినాయి. మాటల్లోకి ఎలా దించాలి?

కొత్తగా వచ్చిన పారిశ్రామిక సంస్కృతి అమాయకమైన గిరిజన సంస్కృతిని ఎలా కాలరాసిందీ ఎలా చిత్రించాలి?

గలగలపారే సెలయేరులాంటి పల్కాల వాగు ఇప్పుడు విషపు వాగుగా మారింది. గిరిజనుల కన్నీళ్ళలా భారంగా కదిలిపోయే ఆ వాగును ఏ విధంగా వర్ణించను?

అమాయకపు గిరిజన స్త్రీ జంగుబాయి హత్యకు దోషి ఎవరు ? లచ్చక్క బిడ్డ ఎందుకు కనిపించకుండా పోయింది ? తొడషం జంగు కొడుకుని ఎవరు చంపినట్టు ? నిస్తేజమైన జీవచ్ఛవాల వంటి ఆ గిరిజన తండాల్లోని మనుషులను బ్రహ్మరాక్షసి పట్టి పీడిస్తున్నది... ఇంకా డబ్బులు రావాలి అనే లచ్చమ్మ ప్రశ్నకు జవాబు ఏమిటి ?

సిమెంట్ దుమ్ములో నిండిపోయిన వాళ్ళ భూముల్లోకి మళ్ళీ జవం నింపేది ఎవరు ?

వెన్నెల రాత్రుల్లో బాయమ్మ తల్లి మళ్ళీ కలకలలాడేనా ?

చిందర వందర అయిపోయిన అమాయక గిరిజన బతుకుల్లో మళ్ళీ వసంతం చిగురించేనా ?

ఏళ్ళ తరబడి అమాయకంగా కొండ కోనల్లో అపార సంపద నింపుకున్న పల్కాల వాగు ఫ్యాక్టరీ యజమానికి బంగారు గుడ్లు పెట్టే బాతు అయితే ఏండ్ల తరబడి ఆ నేలను నమ్ముకున్న గిరిజనుల జీవితాల్లో విషాన్ని చిమ్మింది.

ఇప్పటికీ ఇంకా సిమెంట్ ఫ్యాక్టరీ గిరిజనుల గూడాల్లో విషాన్ని చిమ్ముతూనే ఉంది. కూలీ కోసం అర్రులు సాచే అమాయక గిరిజనులు ఫ్యాక్టరీ గేటు ముందు అదే పనిగా పడిగాపులు పడుతూనే ఉన్నారు.

అమాయక గిరిజన స్త్రీలు నాగరికపు క్రూర కోరల్లో చిక్కుకుని పోతూనే ఉన్నారు. సర్పంచ్ లచ్చిరెడ్డి కనిపించిన వారి కల్లా తమ గోడు వినిపిస్తూనే ఉన్నాడు.

హత్యకు గురైన గిరిజన స్త్రీ జంగుబాయి గురించి విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది... !

గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ హత్యాకాండకు అంతం ఎప్పుడు? ఎన్నడు ? దోషులను శిక్షించేది ఎవరు ?